క్లుప్తంగా

రక్తదాన శిబిరం

చుంచుపల్లి: ఈనెల 17న నిర్వహించిన మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ చేపట్టిన సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూతనంగా జిల్లా పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన రంగరాజు రుక్మారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాళ్ల సోమసుందరం, యడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, భూక్యా సీతారాం నాయక్, ఎర్రం రాజు బెహరా, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్ అగర్వాల్, రాయుడు నాగేశ్వర రావు, పైడిపాటి రవీందర్, బాలగాని గోపికృష్ణ, సన్నాపతి మురళీకృష్ణ పాల్గొన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో సింగరేణి కార్పొరేట్ ఏరియా సేవా సమితి ఆధ్వర్యాన 369 మంది మహిళలకు ఇచ్చిన వృత్తి విద్యాశిక్షణ పూర్తయింది. ఈ సందర్భంగా వీరికి గురువారం రాతపరీక్ష నిర్వహించగా సింగరేణి సేవా అధ్యక్షురాలు హరిణి సత్యనారాయణరావు, డీజీఎం పర్సనల్ ధన్‌పాల్ శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హరిణి మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం టైలరింగ్, మగ్గం, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ తదితర వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇప్పించామని తెలిపారు. డీవైపీఎంలు కె.శివకుమార్, జీకే.కిరణ్‌కుమార్, సేవా కోఆర్డినేటర్ డి.శివకుమార్, ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయ అధికారులు నరేష్‌తో పాటు ఇజాజ్ షరీఫ్, మునీల, పుష్పలత, రమాదేవి, హిమబిందు, అరుణ, స్వర్ణలత, సుజాత పాల్గొన్నారు.

23న వృత్తి విద్యా కోర్సుల ప్రావీణ్య పరీక్షలు

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ఇల్లెందు ఏరియా 2023–24 సంవత్సరానికి గాను ఇల్లెందు, టేకులపల్లిలో నిరుద్యోగ మహిళలకు నిర్వహించే వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు శిక్షకులకు ఈ నెల 23న అర్హత పరీక్ష జేకే కాలనీలోని సింగరేణి స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో మాట్లాడుతూ.. ఉపరితల గనుల ప్రభావిత ప్రాంత ప్రజలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించేందుకు సేవా సమితి కృషి చేస్తోందన్నారు.

జాతీయ సమైక్యతకు పునాది హిందీ

పాల్వంచరూరల్: హిందీ భాషా వారోత్సవాల ముగింపు కార్యక్రమం లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ టి.అరుణకుమారిని సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య మాట్లాడుతూ.. హిందీ భాష జాతీయ భాషగా గుర్తింపు పొందిందని ఇది జాతీయ సమైక్యతకు పునాది అన్నారు. 2023–2024లో ఎంఏ హిందీలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన జి.అక్షయ, ఎస్.మనస్వినిలకు పుస్తకాలను బహూకరించారు.

ఆశ కార్యకర్తల సమ్మె

ఇల్లెందురూరల్: ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మె ప్రారంభిస్తున్నట్లు మండలంలోని ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని పీహెచ్‌సీలలో గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. వైద్యశాఖలో క్షేత్రస్థాయిలో విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తల వేతనాల విషయమై గతంలో అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నేటికీ స్పందన లేదని గుర్తుచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిరవధిక సమ్మె చేపడుతున్నామని తెలిపారు. ఆశ కార్యకర్తలు వజ్జ సుశీల, ఆదిలక్ష్మి, విజయ, హైమవతి, సుగుణ, చంద్రకళ, ఉమాదేవి పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు

జూలూరుపాడు: గ్రామీణ వైద్యులు స్థాయికి మించి వైద్యసేవలు అందించరాదని జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో గ్రామీణ వైద్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తమ పరిధి మేరకే వైద్యసేవలు అందించాలని సూచించారు. ఒక్క రోజు కంటే ఎక్కువ జ్వరం ఉంటే స్థానిక పీహెచ్‌సీకి రిఫరల్ చేయాలని, జ్వరం వచ్చిన రోజే టెస్టులు చేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. అబార్షన్లు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కొండా లక్ష్మణ్ వర్ధంతి

ఇల్లెందురూరల్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచిపోతారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం అలుపెరగని పోరాటం చేసిన బాపూజీ స్వాతంత్య్ర భారతంలో ప్రత్యేక తెలంగాణ కోసం మరో ఉద్యమం చేశారని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర తొలి, మలి దశ ఉద్యమాల్లో ఆయన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

బస్సు సౌకర్యం.. అందని ద్రాక్షేనా?

- ఆర్టీసీ డిపో ప్రారంభమైనా అందని సేవలు
- బస్‌షెల్టర్ ఏర్పాటులోనూ చిన్నచూపు
- ఇల్లెందు డిగ్రీ విద్యార్థులను వెంటాడుతున్న అసౌకర్యాలు



ఇల్లెందులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇల్లెందురూరల్: అత్యధికంగా గిరిజనులైన పేదలైన విద్యార్థులతో ముందుకు సాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అసౌకర్యాలు వెంటాడుతున్నాయి. కళాశాలలో బోధన ఉచితంగా అందుతున్నప్పటికీ... చదువుకోవాలంటే ప్రైవేటు కళాశాలలకు చెల్లించాల్సినంత ఖర్చు చేయాల్సి రావడం విద్యార్థులకు సమస్యగా మారింది. ఈ కారణంగా కొందరు విద్యార్థులు డిగ్రీ చదువులకు దూరమవుతుండగా మరికొందరు ఆర్థిక ఇబ్బందులు పడుతూ కళాశాల మెట్లు ఎక్కుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిత్యం అభివృద్ధి పేరిట రూ.100 కోట్ల లెక్కలు చెపుతుంటారు కానీ, పేద విద్యార్థులకు కనీసం రవాణా సౌకర్యం కల్పించడంపై దృష్టి సారించకపోవడం విచారకరం.

డిపో ప్రారంభమైనా..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పట్టణ శివారు ప్రాంతంలో నిర్మించారు. బస్టాండుకు సుమారుగా నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. దీంతో గతంలో విద్యనభ్యసించిన విద్యార్థులు, విద్యార్థి సంఘాల అభ్యర్థనతో మహబూబాబాద్ ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి కళాశాల పని వేళల సమయంలో మహబూబాబాద్ నుంచి డిగ్రీ కళాశాల వరకు బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో విద్యార్థులు బస్‌పాస్ సౌకర్యంతో ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండానే కళాశాలకు వచ్చేవారు. కానీ నేడు ఆ సౌకర్యం విద్యార్థులకు దూరమైంది. సుమారు నాలుగేళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఇల్లెందుకు శాటిలైట్ బస్ డిపో ఏర్పాటైనప్పటికీ మహబూబాబాద్, గుండాల మార్గాల నుంచి డిగ్రీ కళాశాల వరకు బస్సు సౌకర్యం పొడగింపుపై అధికారులు దృష్టి సారించిన దాఖలాలు లేవు. దీంతో కళాశాలకు వస్తున్న విద్యార్థులు ప్రతిరోజూ రూ.60 – 80 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

బస్టాప్ ఏర్పాటుకూ నోచుకోని కళాశాల...

సాధారణంగా ఉన్నత కళాశాలలు ఉన్నచోట ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆర్టీసీ విద్యార్థుల సౌకర్యార్థం బస్టాప్ ఏర్పాటు చేస్తుంది. నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు ప్రయాణిస్తున్న విషయం తెలిసినప్పటికీ ఆర్టీసీ అధికారులు కళాశాల వద్ద బస్టాప్ ఏర్పాటు చేయకపోవడం విచిత్రంగా ఉంది. ప్రస్తుతం ఇల్లెందు పట్టణ, మండల పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ఒక్కొక్కటి రూ.15వేల – 20 వేల వరకు ఖర్చు చేస్తూ విరివిగా బస్‌షెల్టర్లను నిర్మిస్తున్నారు. పాత బస్టాప్‌లు ఉన్నచోట, ప్రయాణికుల రద్దీ లేని చోటైనా సరే నిర్మాణానికి స్థలం అనువుగా ఉంటే చాలు కొత్తగా బస్‌షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. కానీ వందల సంఖ్యలో పేద విద్యార్థులు చదువుకునే డిగ్రీ కళాశాల వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటును విస్మరించడం అధికారులు, ప్రజాప్రతినిధులకే తెలియాల్సి ఉంది. దీంతో కళాశాల నుంచి ఇంటికి చేరుకునేందుకు విద్యార్థులు సుమారు 1.5 కిలోమీటర్లు నడిచి బస్సు ఎక్కాల్సి రావడం ఇబ్బందిగా ఉంది.

బస్‌పాస్‌లు ఎప్పుడిస్తారో..?

డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం తరగతులు ఆగస్టులో ప్రారంభమయ్యాయి. సాధారణంగా కళాశాల ప్రారంభంలోనే విద్యార్థులకు ఆర్టీసీ అధికారులు బస్‌పాస్‌లు జారీ చేస్తుంటారు. కానీ ఆ సమయంలో బస్‌పాస్‌ల కోసం కొత్తగూడెం వెళ్లి బస్‌పాస్ తీసుకోవాల్సి రావడంతో విద్యార్థులకు సమస్యగా మారింది. కానీ ప్రస్తుతం ఇల్లెందులోనే శాటిలైట్ బస్‌డిపో ప్రారంభం కావడంతో బస్‌పాస్‌లు ఇక నుంచి ఇల్లెందులోనే జారీ చేస్తారన్న ఆశతో ఎదురుచూస్తూ.. కళాశాల విద్యార్థులు రోజులు లెక్కపెట్టుకోవాల్సి వస్తోంది. కనీసం బస్‌పాస్‌లైనా ఇల్లెందులో త్వరితగతిన పంపిణీ చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.


పట్టణంలో పాత బస్‌షెల్టర్ పక్కనే నిర్మిస్తున్న కొత్త బస్‌షెల్టర్

ప్రజాప్రతినిధులు స్పందించాలి...

పూర్తిగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చి చదువుకోవడం హర్షణీయం. కానీ అందుకోసం ప్రతి నెల వేలల్లో డబ్బులు వెచ్చించాల్సి రావడం వారి కుటుంబాలకు ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ఈ సమస్యను విద్యార్థులు అధిగమించడంతోపాటు భవిష్యత్‌లో మరింత మంది విద్యార్థులు విద్యనభ్యసించేలా కళాశాల వరకు బస్‌సౌకర్యం పొడగింపు, కళాశాల వద్ద బస్‌షెల్టర్ నెలకొల్పడంలో ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మూడు వాహనాలు మారుతున్నా..



మాది కారేపల్లి మండలం పోలెంపల్లి. మా గ్రామం నుంచి ఆటోలో రాజీవ్‌నగర్ తండా, అక్కడి నుంచి బస్సులో ఇల్లెందు బస్టాండ్‌కు చేరుకుంటాం. బస్టాండ్ నుంచి సుభాష్‌నగర్ వరకు బస్సులో వెళ్లి 1.5 కిలోమీటర్లు నడిస్తేనే కళాశాలకు చేరుకుంటాం. కాలేజీ వరకు బస్సును నడిపించాలి.

– గుగులోత్ సుప్రియ, బీకాం, పోలెంపల్లి

రోజుకు రూ.80 ఖర్చు..



మాది గుండాల మండలం కాచనపల్లి. మా గ్రామం నుంచి బస్సులో ఇల్లెందుకు చేరుకొని మరో బస్సు ద్వారా సుభాష్‌నగర్‌లో దిగుతాం. అక్కడి నుంచి 1.5 కిలోమీటర్లు నడిచి కళాశాలకు చేరుకుంటాం. దీనికోసం ప్రతి రోజు రూ.80 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది మాకు సమస్యగా ఉంది.

– పర్శిక వంశీవర్ధన్, బీఏ, కాచనపల్లి

వందశాతం రిజర్వేషన్ కల్పించాలి


మాట్లాడుతున్న రాజేశ్ నాయక్

పాల్వంచ: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఏజెన్సీలో వందశాతం రిజర్వేషన్‌ను పరిగణనలోకి తీసుకోకుండా నిరుద్యోగులను నష్టపరుస్తున్నారని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్ అన్నారు. గురువారం స్థానిక నటరాజ్ సెంటర్ వద్ద సంఘ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనులకు మాత్రమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వాలని, వంద శాతం నూతనంగా డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు కల్పించేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. గిరిజన నిరుద్యోగులు ఐక్యంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలన్నారు. ఏజెన్సీలో వందశాతం రిజర్వేషన్ అమలయ్యే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుగులోతు మోహన్ నాయక్, కేశవ నాయక్, భరత్, నరేంద్ర నాయక్, సాగర్, మహేశ్, సునీల్, పృథ్వీరాజ్, రాజ్‌కుమార్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్బన్ ఫారెస్ట్ పార్క్ ప్రారంభం

పాల్వంచరూరల్: తెలంగాణ హరితహారం నిధులతో అటవీ శాఖ అధికారులు పార్క్‌లు నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా బస్వతారాక కాలనీ పంచాయతీ సోములగూడెం రోడ్డులో రూ.1.44 కోట్లు ఖర్చు చేసి 250 ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించనున్నట్లు ఎఫ్‌డీఓ తిరుమలరావు గురువారం తెలిపారు. పార్క్‌కు ముఖ్యద్వారం, లోపల 5 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, ఊట చెరువు, పార్క్ చుట్టూ ఇనుప కంచె, 16 రాక్ ఫిల్ చెక్‌డ్యామ్‌లు, సోలార్ పంప్‌సెట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సాగు పరికరాల కేంద్రం..

వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ) పథకం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా రైతులకు అద్దెలకు ఇచ్చేందుకు పట్టణంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో రూ.10.91 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అద్దె వ్యవసాయ పరికరాల కేంద్రాన్ని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఏపీఎం రాంబాబు గురువారం తెలిపారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం నేతలు గురువారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవరకొండ శంకర్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నేత ఎండీ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. లాభాల వాటలో 30 శాతం బోనస్ చెల్లించాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో దాట్ల వెంకటేశ్వర్లు, జమున, మోహన్, శేషమమ్మ, ఎర్రమ్మ, విజయ, పద్మ, కనకతార, ఉప్పలయ్య, హేమంత్, రవి, కిరణ్, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులతో సమావేశం

జూలూరుపాడు: ట్రికార్ రుణాలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన సమావేశం జరిగింది. 2020–2021, 2021–2022లో ట్రికార్ రుణాల లబ్ధిదారుల ఎంపిక జరిగింది. డ్యూయల్ అకౌంట్ ఓపెన్ కాని లబ్ధిదారులు 104 మంది ఉండగా, సబ్సిడీ వచ్చిన 46 మంది లబ్ధిదారుల గ్రౌండింగ్ పూర్తి కాలేదు. దీంతో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు జూలూరుపాడు ఎస్‌బీఐ, సహకార బ్యాంకు, జూలూరుపాడు, పాపకొల్లు, గుండెపుడి ఏపీజీవీబీ బ్యాంకు అధికారులతో ట్రికార్ రుణాలపై చర్చించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ట్రికార్ లబ్ధిదారులు శుక్రవారం సంబంధిత బ్యాంకులకు ఆధార్, పాన్ కార్డు, పాస్ ఫొటోలు, బ్యాంకు పాస్ బుక్ తీసుకొని వెళ్లాలని వెంకటేశ్వరరావు చెప్పారు.

కార్యక్రమంలో స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ ఆర్.వెంకటేశ్వర్లు, జూలూరుపాడు, పాపకొల్లు, గుండెపుడి ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్లు ఐజాక్, ప్రవీణ్, నమ్రత, డీసీసీబీ సూపర్‌వైజర్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మానవహారం చేపట్టి నిరసన


ఇల్లెందు: అంగన్‌వాడీల మానవహారం

అంగన్‌వాడీ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం 11 రోజులుగా చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గురువారం రోడ్డెక్కారు. ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్ సంఘం నేతలు మాట్లాడుతూ.. ఎలాంటి హామీలు ఇవ్వకుండా, సమస్యలు పరిష్కరించకుండా సమ్మె విరమించేది లేదని పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


సుజాతనగర్ కూడలిలో...


టేకులపల్లిలో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంరూరల్: పల్లెలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామ పంచాయతీలో సుమారు రూ.80 లక్షలతో చేయనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేస్తామన్నారు. మౌలిక సదుపాయల కల్పనలో పెద్దపీట వేస్తామని చెప్పారు. అనంతరం వార్డులలో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ భూక్యా సోనా, ఉర్దూఘర్ కమిటీ చైర్మన్ అన్వర్‌పాషా, ఎంపీటీసీలు కొల్లుపద్మ, బాబురావు, కోఆప్షన్ సభ్యుడు జక్కుల సుందర్, సర్పంచ్ పూనం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ లగడపాటి రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, శేష్రాది వినోద్, కొండలరావు షఫీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం



చేప పిల్లలను అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: గ్రామాల సమగ్రాభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, సీసీ రహదారుల పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. తండాలు, గూడేలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్ అనతికాలంలోనే పరిపాలన సౌలభ్యం కోసం ప్రతి గ్రామపంచాయతీకి కార్యాలయ భవనం నిర్మించడం హర్షణీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు మరోసారి గెలిపించి అభివృద్ధిని మరింతగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దిండిగల రాజేందర్, ప్రమోద్, ఘాజీ, కుమ్మోత్ జానకి, మూతి వెంకటేశ్వర్లు, బానోత్ సంతు, మంకిడి కృష్ణ, భూక్యా నందు, సుమలత, జనగం కోటేశ్వరరావు, పోలేపల్లి నాగేశ్వరరావు, లష్కర్, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ, ఏఈ రాజు, శీలం రమేష్, ఖమ్మంపాటి నర్సింహారావు, గైగొళ్ల శ్రీను, కుమార్, సృజన్, కమల తదితరులు పాల్గొన్నారు.

మత్స్యసంపద వృద్ధితో బహుళ ప్రయోజనాలు

మత్స్యసంపద వృద్ధితో బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం చేప పిల్లల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మాట్లాడుతూ.. చెరువుల్లో చేపల పెంపకంతో మత్స్యకారులకు, చేపల సొసైటీలకు ఆదాయం పెరగడంతోపాటు, ప్రజలకు తక్కువ ధరలో చేపలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


పాల్వంచ: రాస్తారోకో చేస్తున్న నాయకులు

పాల్వంచ: ఎస్సీ వర్గీకరణకు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు కొత్తపల్లి సోమయ్య అన్నారు. ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ సెంటర్‌లో బీసీఎం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా భారీ ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి పదేళ్లు గడిపారన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ చేయకపోతే బీజేపీకి భారీ మూల్యం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో దాసరి శ్రీను, మిరియాల వెంకటేశ్వర్లు, వంగూరి రామ్మూర్తి, నల్లగట్ల తిరుపతయ్య, గంగపురి శ్రీను, కొత్తపల్లి శ్రీను, నారపోగు నాగరాజు, దాసరి యాకయ్య, బొగిని సందీప్, సారయ్య, సాంబ, సారథి, ముత్తారావు, చంద్రం, మురళీ కృష్ణ, ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

సుజాతనగర్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీలో ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని మాదిగ బుడగ జంగాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో గురువారం నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం న్యాయ పోరాటం చేస్తున్న మందకృష్ణకు మద్దతు తెలియజేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కత్తి వెంకన్న, సిరిగిరి మురళి, కాకటి బాబు, మురిపిటి నగేష్, వేల్పుల భాస్కర్, సిరిగిరి భాస్కర్, కత్తి నరసింహారావు, పసుపులేటి నాగేశ్వరరావు, సిరిగిరి రవి, నిడిగుండ వెంకటకష్ణ, మానుకొండ అక్కులు, కళ్యాణం చిన్న మారయ్య పాల్గొన్నారు.

క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి



కబడ్డీలో తలపడుతున్న కస్తూర్బా, గురుకుల పాఠశాల విద్యార్థినులు

పాల్వంచరూరల్: విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని మండల విద్యాధికారి శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల క్రీడామైదానంలో గురువారం మండల స్థాయి క్రీడాపోటీలను ఎంఈఓ ప్రారంభించారు. ఈ పోటీలకు 12 పాఠశాలలకు చెందిన అండర్ 14, 19 విభాగంలో 700 మంది విద్యార్థినులు హాజరయ్యారు. కబడ్డి, ఖోఖో, అథ్లెటిక్స్, లాంగ్ జంప్, షాట్‌పుట్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. శుక్రవారం బాలురకు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలను 26, 27 తేదీల్లో బొల్లోరిగూడెం హైస్కూల్‌లో జరగనున్న జోనల్ క్రీడా పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణ, ఎంపీఓ బి.నారాయణ, రాజమొగిలి, సర్పంచ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుడికి పూజలు


టేకులపల్లిలో సహస్ర దీపాలంకరణ


గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల కూడళ్లలో ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్యకు భక్తులు గురువారం ఘనంగా పూజ చేశారు. ఆయా గ్రామాల్లో కొలువైన్న మండపాలను పలువురు ప్రజాప్రతినిధులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు దంపుతులు పీటలపై కూర్చొని పూజలో చేశారు. పలుచోట్ల మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంటౌన్: శ్రీచండీ పీఠంలో గణేష్ మండపంలో పూజ చేస్తున్న వేదపండితులు శర్మ


కొత్తగూడెంటౌన్: రామవరంలో..


జూలూరుపాడు: పాపకొల్లులో..


సుజాతనగర్: వేపలగడ్డలో పూజ చేస్తున్న భక్తులు


ఇల్లెందు: స్టేషన్ బస్తీలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య


పాల్వంచ: అన్నదానం ప్రారంభిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు


ఇల్లెందురూరల్: లక్ష్మీపురం గ్రామంలో..